మోసం.. చంద్రబాబు నైజం

● వైఎస్సార్‌ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ చుండూరి రవిబాబు

ఒంగోలు సిటీ: ప్రజలను నమ్మించి మోసం చేయడం సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ చుండూరి రవిబాబు అన్నారు. ఒంగోలు నగరంలోని 27వ డివిజన్‌లో బుధవారం వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చుండూరి రవిబాబు మాట్లాడుతూ సూపర్‌సిక్స్‌ పేరుతో ఎన్నో పథకాలు ప్రకటించి వాటిని ప్రజలకు అందించకుండా మాయమాటలతో ఏడాది పాలన పూర్తి చేశారని విమర్శించారు. మోసం, వంచనకు


సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి రవిబాబు

కూటమి ప్రభుత్వం కేరాఫ్‌ అడ్రస్‌గా మారిందన్నారు. ప్రజల్ని మోసం చేయడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమాన్ని, ప్రస్తుత కూటమి హయాంలో సంక్షేమాన్ని ఎగ్గొట్టి చోద్యం చూస్తున్న విధానాన్ని ప్రజానీకం గమనిస్తోందని, వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని మండిపడ్డారు. ప్రజలు ఏ విధంగా మోసపోయారనే విషయంపై వైఎస్సార్‌ సీపీ శ్రేణులంతా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్‌ సెల్‌ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, డివిజన్‌ నూతన అధ్యక్షుడు రెడ్డి పరమేశ్వరరావు, చిన్నా, బుజ్జి, సీనియర్‌ నాయకులు దామరాజు క్రాంతికుమార్‌, కార్పొరేటర్‌ ఇమ్రాన్‌ఖాన్‌, రవిచంద్ర, దాసరి కరుణాకర్‌, ప్రసాద్‌, సునీల్‌, జనార్దన్‌, అప్సరభేగం, ప్రసన్న, మేరీ, వాణి, శ్రీకాంత్‌, మల్లిశెట్టి దేవ, ప్రవీణ్‌, ఆవుల అనిల్‌, కృష్ణ, రవి తేజ, జె.శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

క్లుప్తంగా

రైతుల సమస్యలు పరిష్కరించాలి


అభినందనలు తెలియజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

చీమకుర్తి: రైతుల సమస్యలపై సానుకూలంగా వ్యవహరించాలని ప్రజాసంఘాల నాయకులు చీమకుర్తి సొసైటీ ప్రెసిడెంట్‌గా నియమించబడిన పూనాటి వెంకట్రావుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం చీమకుర్తిలోని వెంకట్రావు నివాసంలో ప్రజాసంఘాల నాయకులు పేరం శ్రీనివాసరావు, పిన్నిక శ్రీనివాసరావు, బత్తుల మల్లికార్జున, షేక్‌ ఖాదర్‌బాషా తదితరులు పూనాటి వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. చీమకుర్తి వ్యవసాయ పరపతి సంఘం నూతన ప్రెసిడెంట్‌గా నియమించబడిన వెంకట్రావుకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

గాయకుడికి నివాళులు

ఒంగోలు మెట్రో: ప్రముఖ గాయకుడు, ఉపాధ్యాయుడు గుంజి అచ్యుత్‌ మొదటి వర్ధంతి సందర్భంగా నరసం ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్‌ బోర్డులోని కార్యాలయంలో బుధవారం ఉదయం ఘనంగా నివాళులర్పించారు. అతని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

న్యాయం చేయాలంటూ వృద్ధుడి వేడుకోలు

మార్కాపురం: మాయ మాటలతో తన ఆస్తులు రిజిస్ట్రేషన్‌ చేయించుకుని రోడ్డున పడేశారని, తనకు న్యాయం చేయాలని మార్కాపురం పట్టణానికి చెందిన వృద్ధుడు దండూరి పెద్దన్న అధికారులను కోరుతున్నాడు. బుధవారం ఆయన తన ఆవేదనను విలేకరులకు తెలిపాడు. కంభం మండలం రావిపాడు గ్రామానికి చెందిన తాను సుమారు 30 ఏళ్ల నుంచి మార్కాపురంలో నివాసం ఉంటున్నానని చెప్పాడు. తన ఆస్తిని రక్త సంబంధీకులే మాయమాటలు చెప్పి రిజిస్ట్రేషన్‌ చేయించుకుని అవసాన దశలో వదిలేయడంతో తినడానికి తిండి లేక ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. కరోనా సమయంలో తనతో రిజిస్ట్రేషన్‌ చేయించుకున్నట్లు తెలిపారు. రోజూ భోజనానికి అలమటిస్తున్నానని, తనతో చేయించుకున్న అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కోరాడు. ఇటీవల గ్రీవెన్స్‌లో కూడా తన సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పెద్దన్న వివరించాడు.

రశీదులు లేకుండా విత్తనాలు కొనవద్దు

బేస్తవారిపేట: రశీదులు తీసుకోకుండా పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు చేయవద్దని వ్యవసాయాధికారి షేక్‌ అబ్దుల్‌ రఫీక్‌ అన్నారు. మండలంలోని ఎంపీ చెరువు, ఖాజీపురంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తీసుకున్న రశీదులు, ప్యాకెట్లు భద్రపరచుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి ఫసల్‌ బీమా పథకంలో క్రాప్‌ ఇన్సూరెన్స్‌ మీసేవా కేంద్రాలో నగదు చెల్లించి ఇన్సూరెన్స్‌ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ ఆదిగణేష్‌, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.


బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం గురించి వివరిస్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

‘బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ’ని
విజయవంతం చేయాలి

కొత్తపట్నం: బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పిలుపునిచ్చారు. కొత్తపట్నం మండల కార్యకర్తలతో బుధవారం స్థానిక బస్టాండ్‌ సెంటర్‌లోని కళా మందిరంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ సాయంత్రం 4 గంటలకు కొత్తపట్నంలోని ద్వారకా నగర్‌ నుంచి బస్టాండ్‌ సెంటర్‌ వరకు ర్యాలీగా వచ్చి బస్టాండ్‌ సెంటర్‌లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేయనున్నట్లు తెలిపారు. అనంతరం ర్యాలీగా వెళ్లి సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. 15 గ్రామ పంచాయతీల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్‌ సీపీ రైతు విభాగం రాష్ట్ర జోనల్‌ ప్రెసిడెంట్‌, ఎంపీటీసీ సభ్యుడు ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమంలో బాబు చేసిన అనేక మోసపూరిత హామీల గురించి చర్చించారు. సూపర్‌ సిక్స్‌ హామీల పేరుతో ప్రజలను చంద్రబాబు ఎలా మోసం చేశాడనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, తంబి కాంతారావు, గౌరవరపు శివాజీ, తంబి వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, తాతా నాంచార్లు, శ్రీను, సుబ్రహ్మణ్యం, వెంకారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

చీమకుర్తి రూరల్‌ (సంతనూతలపాడు): ప్రభుత్వ హాస్పిటళ్లలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి టి.వెంకటేశ్వర్లు సూచించారు. సంతనూతలపాడు మండలం వేములపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ సందర్శించి వైద్య సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. వైద్య సేవల ద్వారా ప్రజల మన్ననలు పొంది ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సిబ్బందితో డీఎంహెచ్‌వో సమీక్షించారు. హాస్పిటల్‌ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వేములపాడు మెడికల్‌ ఆఫీసర్‌


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు

జి.కమల, సూపర్‌వైజర్లు అరుణ్‌ కుమారి, సురేఖ, శేషారావు, ఫార్మసీ ఆఫీసర్‌ కే రత్నాకర్‌బాబు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్విస్‌ కళాశాలలో ఐఈఈఈ సినర్జీ-2025


కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్‌, విద్యార్థులు

ఒంగోలు సిటీ: నగరంలోని క్విస్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో బుధవారం ఐఈఈఈ సినర్జీ – 2025 కార్యక్రమం నిర్వహించారు. రామానుజన్‌ సెమినార్‌ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వై.వి.హనుమంతరావు, ఐఈఈఈ కౌన్సిలర్‌ డాక్టర్‌ సీహెచ్‌ హిమబిందు పాల్గొన్నారు. ఇప్పటి వరకు చైర్మన్‌గా వ్యవహరించిన విద్యార్థి చదువు పూర్తి చేసుకుని వెళ్తూ ఈ ఏడాది నాలుగో సంవత్సరానికి వచ్చిన విద్యార్థులకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ హనుమంతరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఐఈఈఈ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రాజెక్ట్‌లు, పేపర్‌ పబ్లిషింగ్‌ తదితర అంశాలకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీలు డాక్టర్‌ బుజ్జిబాబు, డాక్టర్‌ జీఎల్‌వీ ప్రసాద్‌, డాక్టర్‌ సెంథిల్‌, డాక్టర్‌ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్‌ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న కార్మికులు

గిద్దలూరు రూరల్‌: ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి మున్సిపల్‌ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్‌ కార్యాలయం ఎదుట మున్సిపల్‌ కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అక్కడ నుంచి కుమ్మరాంకట్ట, వైఎస్సార్‌ సెంటర్ల మీదుగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్‌ ఇంజినీరు, పారిశుద్ధ్య కార్మికులు వారి సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెలో భాగంగా నిరసన తెలియజేస్తున్నామన్నారు. జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, క్యాటగిరీ వైజ్‌గా కార్మికులందరికీ వేతనాలు చెల్లించాలని, రిటైర్డ్‌ అయిన కార్మికుల పిల్లలకు ఉద్యోగం కల్పించాలని, వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, గత సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలనే డిమాండ్ల సాధన కోసం కార్మికులు ఐకమత్యంగా పోరాడతారన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు మురళి, రవి, చంటయ్య, మస్తాన్‌రెడ్డి, సలీమ్‌, రహమ్మతుల్లా, పుల్లయ్య, నాగయ్య, రంగస్వామి, శ్రీరాములు, కమలమ్మ, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష

చీమకుర్తి రూరల్‌ (సంతనూతలపాడు): స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో బుధవారం మండల స్థాయిలో ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బందితో ఎంపీడీవో డి సురేష్‌ బాబు సమీక్షించారు. టార్గెట్‌ ప్రకారం ఉపాధి హామీ పనులు జరగాలని, కూలీలందరూ పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఫారం పాండ్స్‌ పనులు ప్రారంభించాలని, మంజూరైన కంపోస్ట్‌ ఫిట్స్‌ వర్కులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి కూలీలకు ఉపాధి పనులపై అవగాహన కల్పించాలని, ఫీల్డ్‌లో కొలతల ప్రకారం కచ్చితంగా పనులు చేపట్టాలని ఉపాధి హామీ సిబ్బందిని


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

ఆదేశించారు. మండల ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ ఏపీవో వాసంతి, ఈసీ ఈశ్వరి, టెక్నికల్‌ అసిస్టెంట్లు, ఫీల్డ్‌ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సమ్మె బాట పట్టిన మున్సిపల్‌ కార్మికులు

చీమకుర్తి: మున్సిపల్‌ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నెల రోజుల నుంచి పోరాటం చేస్తున్నాం.. కానీ, రాష్ట్ర ప్రభుత్వం మొండికేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.. చేసేది లేక బుధవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగాల్సి వచ్చిందని మున్సిపల్‌ వర్కర్లు తెలిపారు. చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్‌ పారిశుద్ధ్య కార్మికులు, కోవిడ్‌ కార్మికులు, ఇంజినీరింగ్‌ వర్కర్లు మొత్తం కలిపి 130 మంది వరకు ఉన్నారు. వారంతా సీఐటీయూ జెండాలతో స్థానిక బస్టాండ్‌ నుంచి మున్సిపల్‌ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. సమ్మెలోకి వెళ్తున్నట్లు కమిషనర్‌ కార్యాలయ సిబ్బందికి తెలిపారు. గత సమ్మె కాలానికి సంబంధించిన ఒప్పందాలకు తక్షణమే జీఓలు విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. పారిశుద్ధ్య పనులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలన్నారు. కోవిడ్‌ కార్మికులు, ఇంజినీరింగ్‌ వర్కర్లకు జీఓ నంబర్‌ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలన్నీ మున్సిపల్‌ వర్కర్లకు



చీమకుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్‌ కార్మికులు

అమలు చేయాలని, రిటైర్డ్‌ బెనిఫిట్స్‌, గ్రాట్యుటీని ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. దహన సంస్కారాలకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. సీఐటీయూ నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు, పూసపాటి వెంకట్రావు, తదితరులు మున్సిపల్‌ వర్కర్లకు తమ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వర్కర్లు ఏడుకొండలు, పద్మ, నర్సయ్య, కోటేశ్వరరావు, నాగయ్య, స్థానికులు పాల్గొన్నారు.

కృష్ణా జెడ్పీ చైర్మన్‌పై దాడి అమానుషం


మాట్లాడుతున్న రంగస్వామి గౌడ్‌, గౌడ సంఘ సభ్యులు

మార్కాపురం: ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్‌ చైర్మన్‌ ఉప్పాల హారికపై దాడి అమానుషమని, జిల్లా ప్రథమ పౌరురాలుపై దాడి దుర్మార్గమని మార్కాపురం గౌడ సంఘ అధ్యక్షుడు ఇల్లూరి రంగస్వామిగౌడ్‌, ఉపాధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు గౌడ్‌, యూత్‌ అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాసులు గౌడ్‌ ఖండించారు. బుధవారం మార్కాపురం పట్టణంలో వారు పాత్రికేయులతో మాట్లాడారు. జిల్లాకు సంబంధించి చైర్మన్‌తో పాటు జెడ్పీటీసీ సభ్యురాలు, నియోజకవర్గానికి వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న హారికపై దాడి చేయడం మంచిపద్ధతి కాదన్నారు. బీసీ సామాజికవర్గంలోని గౌడ సామాజిక వర్గానికి చెందిన హారికపై చేసిన దాడిని తమ సంఘం తరపున ఖండిస్తున్నామన్నారు. ఈ సంఘటనపై బడుగు బలహీనవర్గాలకు చెందిన నాయకులందరూ ఖండించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే రాబోయే రోజుల్లో బీసీలకు రాజకీయ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. గౌడ వర్గీయులందరూ ఈ విషయంలో ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. బీసీలకు ఎక్కడ అన్యాయం జరిగినా తాము సహించమని స్పష్టం చేశారు. సమావేశంలో శ్రీరంగం గుండ్లా వెంకటేశ్వర్లు, జూపల్లి వెంకటరావు, జి.రంగారావు పాల్గొన్నారు.





భగ్గుమంటున్న భానుడు

జూలై మూడో వారం వచ్చినా భానుడి ప్రతాపం తగ్గడం లేదు. ఉదయం 7 గంటలకే ఎండలు మండిస్తూ మంటపుట్టిస్తున్నాడు. వడగాడ్పులు కూడా వీస్తుండటంతో 10 గంటల నుంచి ప్రజలు రోడ్లపై తిరగలేకపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చిన వారు సూర్యప్రతాపం నుంచి తప్పించుకునేందుకు గొడుగులు, ముసుగులు ధరించి అష్టకష్టాలు పడుతున్నారు. సాయంత్రం 6.30 గంటల వరకూ మండువేసవిని తలపిస్తూ ఎండలు కాస్తున్నాయి. వేడి గాలులు, ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తట్టుకోలేక తల్లడిల్లుతున్న జిల్లా ప్రజలు వరుణ దేవుడి కరుణ కోసం ఆశగా ఆకాశం వైపు చూస్తున్నారు.

– సాక్షి, ఒంగోలు


